# సాక్షి అనంతపురం

ఆదివారం । 22 । డిసెంబర్ । 2024




### చీనీ టన్ను రూ.30,290

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.30,290 పలికాయి.



### టమాట కిలో రూ.16

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.16 పలికింది. కనిష్టం రూ.5, సరాసరి రూ.10 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.9°/17.7°

జిల్లా అంతటా శనివారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

## న్యూస్‌రీల్

### పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

**గుంతకల్లు/రూరల్/గుత్తి:** పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ పోలీస్ సిబ్బందికి సూచించారు. శనివారం ఆయన గుంతకల్లు డీఎస్పీ కార్యాలయాన్ని, కసాపురం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. గుత్తి పట్టణంలోని పోలీస్ క్వార్టర్స్, పెట్రోల్ బంకు ఏర్పాటు స్థలాన్ని పరిశీలించారు. సబ్ డివిజన్ పరిధిలో పెండింగ్ కేసుల వివరాలను ఆరా తీశారు. సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. పెండింగ్ కేసులకు వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదగా మాట్లాడాలని సూచించారు. సకాలంలో సమస్యలను పరిష్కరిస్తూ ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని ఆదేశించారు. అంతకుముందు కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని ఆయన దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు స్వామివారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

### పదోన్నతుల సీనియార్టీ జాబితా సిద్ధం

**అనంతపురం ఎడ్యుకేషన్:** నగరపాలక సంస్థతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మునిసిపల్ పాఠశాలల్లో పని చేస్తున్న అర్హులైన ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించేందుకు తుది జాబితా సిద్ధం చేశారు. 1:5 నిష్పత్తిలో తయారు చేసి డీఈఓ బ్లాగ్‌లో ఉంచారు. సీనియార్టీ జాబితాలోని అభ్యర్థులందరూ సర్వీస్ రిజిస్టర్, ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలనకు ఈనెల 23న డీఈఓ కార్యాలయానికి రావాలని డీఈఓ ప్రసాద్‌బాబు సూచించారు. కార్పొరేషన్ ఒక యూనిట్‌గా, మునిసిపాలిటీ మరొక యూనిట్‌గా పరిగణించి పదోన్నతులు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

### 'హెచ్చెల్సీ' కమిటీ చైర్మన్‌గా జోగిరెడ్డి



నూతన చైర్మన్, వైస్ చైర్మన్లతో టీడీపీ నాయకులు

**అనంతపురం సెంట్రల్:** హెచ్చెల్సీ ప్రాజెక్టు కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సాగునీటి సంఘం ఎన్నికల్లో టీడీపీ హైకమాండ్‌దే తుది నిర్ణయంగా మారింది. పై నుంచి వచ్చిన ఆదేశాలతో కార్యక్రమాన్ని మమ అనిపించారు. శనివారం అనంతపురం హెచ్చెల్సీ కాలనీలోని లోకలైజేషన్ డివిజన్ కార్యాలయంలో ఎన్నిక నిర్వహించారు. ప్రాజెక్టు కమిటీ అధ్యక్షుడిగా వైఎస్సార్ జిల్లా కాసనూరు డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, వైస్ చైర్మన్‌గా హెచ్ఎల్ఎంసీ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ కొండాపురం కేశవరెడ్డిని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా ఈఈ రమణారెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో టీడీపీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీటెక్ రవి, అనంతపురం జిల్లా అధ్యక్షుడు సాంబశివుడుయాదవ్, నాయకులు శ్రీధర్‌చౌదరి, ముంటిమడుగు కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.







రాప్తాడులో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, కళ్యాణదుర్గంలో వైఎస్ జగన్ జన్మదిన వేడుకల్లో మాజీ ఎంపీ రంగయ్య, నాయకులు, అనంతపురం సర్వజనాస్పత్రి ఎదుట అన్నదానం చేస్తున్న ఆలూరి సాంబశివారెడ్డి, సమన్వయకర్త వీరా

# జనం మదిలో జగనన్న



అనంతపురంలోని పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న జిల్లా అధ్యక్షుడు అనంత, చిత్రంలో ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పార్టీ శ్రేణులు

- వండుగలా వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం
- తరలివచ్చిన పార్టీ శ్రేణులు
- పెద్ద ఎత్తున సామాజిక సేవా కార్యక్రమాలు
- జననేతను మళ్లీ సీఎం చేసుకుందాం: పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత పిలుపు

**అనంతపురం కార్పొరేషన్:** వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరిగాయి. పార్టీ శ్రేణులు నూతనోత్సాహంతో వేడుకల్లో పాల్గొన్నారు. సేవా కార్యక్రమాలతో స్ఫూర్తిచాటారు. జై జగన్..జైజై జగన్ నినాదాలతో మార్మోగించారు. అనంతపురంలోని పార్టీ జిల్లా కార్యాలయం వద్ద పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య తదితరులు పాల్గొన్నారు. పార్టీ టాస్క్‌ఫోర్స్ సభ్యులు రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో కమలానగర్‌లోని నిరాశ్రయుల ఆశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు, బ్రెడ్డును జిల్లా అధ్యక్షుడు అనంత పంపిణీ చేశారు. ఎస్కేయూలో వైఎస్సార్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్, నాయకులు లింగారెడ్డి, నరేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- ఎన్ని ఇబ్బందులు ఎదురైనా హామీలను అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదినం సందర్భంగా రాప్తాడులో ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మీతో కలిసి భారీ కేక్‌ను ఆయన కట్ చేశారు. ఈ సందర్భంగా ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని, ఆయన నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఆకాంక్షించారు.
- బుక్కరాయసముద్రంలో దివంగత నేత వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ మాజీ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, పార్టీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో జగనన్న పుట్టిన రోజు వేడుకలను జరుపుకుంటున్నారన్నారు. నేరుగా ప్రజలకే సంక్షేమ పథకాలు అందజేసిన సీఎంగా జగనన్న చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. అనంతరం ఆలూరు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో అనంతపురం సర్వజనాస్పత్రి వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.
- చంద్రబాబు ఏడు నెలల పాలనలో అవినీతి, అన్యాయం, అరాచకం, దౌర్జన్యం, అక్రమ కేసులు తప్ప అభివృద్ధి, సంక్షేమం కనిపించడం లేదని రాయదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి మండిపడ్డారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ జన్మదినం సందర్భంగా రాయదుర్గంలో ఆయన కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్పా, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- కళ్యాణదుర్గంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విప్లవాత్మక సంస్కరణలతో ప్రజల జీవితాల్లో జగనన్న వెలుగులు నింపారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను చంద్రబాబు విస్మరించారని ఆయన విమర్శించారు.
- ఉరవకొండలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ వై.ప్రణయ్ రెడ్డి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం పట్టణంలోని టవర్‌క్లాక్ వరకు బైక్ ర్యాలీ చేపట్టి, దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్డు అందించారు.
- తాడిపత్రిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో, ముస్లిం మైనార్టీ విభాగం సీనియర్ నాయకుడు ఫయాజ్ బాషా కార్యాలయంలో వేడుకలు జరిగాయి.
- గుంతకల్లు వైఎస్సార్ సర్కిల్‌లోని వైఎస్సార్ విగ్రహం ఎదుట వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ భవాని, వైస్ చైర్‌పర్సన్లు నైరుతి రెడ్డి,మైమూన్ ఆధ్వర్యంలో స్థానిక ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు.

### మరోసారి ముఖ్యమంత్రి చేసుకుందాం

సంక్షేమ ప్రదాత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి సీఎం చేసుకుందామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. అనంతపురంలో కేక్ కట్ చేసిన అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అవినీతికి ఆస్కారం లేకుండా ప్రజల ఖాతాల్లోకి నేరుగా డబ్బు జమ చేశారన్నారు. 'అమ్మఒడి', 'విద్యా దీవెన', 'విద్యా కానుక', 'అందరికీ ఇళ్లు' తదితర పథకాల్లో మహిళలకే జగనన్న ప్రాధాన్యత కల్పించారన్నారు. అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజల హృదయాల్లో గూడు కట్టుకున్న నేత జగన్ అని కొనియాడారు. రాజకీయ కక్షతో జైలుపాలు చేసినా ప్రజల కోసం రాజీలేని పోరాటాలు చేశారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలకు అండగా నిలవాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యకర్తలు ఎవరికీ భయపడాల్సిన పని లేదని, ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామన్నారు.







రాయదుర్గంలో పార్టీ అధినేత జన్మదిన వేడుకల్లో మెట్టు గోవిందరెడ్డి, నాయకులు

గుంతకల్లులో కేక్ కట్ చేస్తున్న పార్టీ శ్రేణులు

ఉరవకొండలో వైఎస్సార్ సీపీ నేత ప్రణయ్ రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు

### నేటి నుంచి అండర్–19 క్రికెట్ మ్యాచ్

**అనంతపురం:** అనంతపురం ఆర్డీటీ స్టేడియం వేదికగా అండర్–19 కూచ్ బెహర్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆదివారం ప్రారంభం కానుంది. ఈ నెల 25న మ్యాచ్ ముగియనుంది. ఉదయం 9.30 గంటలకు ఇన్నింగ్స్ ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర జట్లు తలపడనున్నాయి. ఇప్పటికే ఇరు రాష్ట్రాల జట్లు అనంతపురంలోని ఆర్డీటీకి చెందిన స్పోర్ట్స్ అకాడమీకి చేరుకుని ప్రాక్టీస్‌లో బిజీగా గడుపుతున్నాయి. మ్యాచ్ నిర్వహణకు సంబంధించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకున్నట్లు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సానా సతీష్ బాబు పేర్కొన్నారు.

### వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

- పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా చంద్ర
- ఉత్తర్వులు విడుదల చేసిన పార్టీ కేంద్ర కార్యాలయం

**అనంతపురం కార్పొరేషన్:** ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి, ప్రజలకు అండగా నిలిచేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కార్యోన్ముఖులయ్యారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు విడుదల చేసింది. యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా సాకే చంద్రశేఖర్ (అనంతపురం అర్బన్), మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా శ్రీదేవి (అనంతపురం అర్బన్), రైతు విభాగం జిల్లా అధ్యక్షుడిగా వై.నారాయణ రెడ్డి(శింగనమల), బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా కురుబ దేవేంద్ర సిజల (ఉరవకొండ), ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా మల్లెమీద నరసింహులు (అనంతపురం అర్బన్), మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఎం.సైపుల్లాబేగ్(అనంతపురం అర్బన్), క్రిస్టియన్ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా వై.ప్రసాద్‌బాబు (గుంతకల్లు), విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడిగా జీ. చంద్రశేఖర్ యాదవ్ (అనంతపురం అర్బన్), పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షుడిగా బీ. యోగేంద్ర రెడ్డి (ఉరవకొండ), మునిసిపల్ వింగ్ జిల్లా అధ్యక్షుడిగా దేవరింటి బోయ సుంకప్ప(గుంతకల్లు), ఆర్టీఐ వింగ్ జిల్లా అధ్యక్షుడిగా కే శ్రీనివాస్ రెడ్డి (అనంతపురం అర్బన్), వలంటీర్స్ వింగ్ జిల్లా అధ్యక్షుడిగా ఎం. ధనుంజయ (ఉరవకొండ), గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా బాకే హబీబుల్లా (అనంతపురం అర్బన్), వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడిగా కేఎం. రేవన్న(కళ్యాణదుర్గం), చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడిగా సీ.నాగప్ప(రాయదుర్గం), వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా కే. ఓబిరెడ్డి(అనంతపురం అర్బన్), అంగన్‌వాడీ విభాగం జిల్లా అధ్యక్షురాలిగా ఎంసీ. సంధ్యారాణి (కళ్యాణదుర్గం), లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా గాజుల ఉమాపతి (అనంతపురం అర్బన్), దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఉపేంద్రగౌడ్ (తాడిపత్రి), కల్చరల్ వింగ్ జిల్లా అధ్యక్షుడిగా బీ.నాగరాజు(అనంతపురం అర్బన్), సోషియల్ మీడియా జిల్లా అధ్యక్షుడిగా వై. నరేంద్రనాథ్ రెడ్డి (అనంతపురం అర్బన్), ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడిగా వై.రాజశేఖర్ రెడ్డి (గుంతకల్లు), వైద్యుల విభాగం జిల్లా అధ్యక్షుడిగా జీ.బొమ్మయ్య (కళ్యాణదుర్గం), బూత్ కమిటీ అధ్యక్షుడిగా వై.అమర్‌నాథ్ రెడ్డి (అనంతపురం అర్బన్), ఇంటెలెక్చువల్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా పీ. రమేష్‌బాబు(అనంతపురం అర్బన్), పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడిగా జే.విజయభాస్కర్ రెడ్డి (ఉరవకొండ)ని నియమించారు.



# దారికాచిన మృత్యువు

- మడకశిర మండలం బుళ్లసముద్రం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం
- ఆగి ఉన్న లారీని ఢీ కొన్న టెంపో ట్రావెలర్
- నలుగురు మృత్యువాత.. 11 మందికి తీవ్ర గాయాలు



తల్లి ప్రేమకుమారి, కుమారుడు అథర్వ, రత్నమ్మ మృతదేహాలు

**మడకశిర రూరల్:** మండల పరిధిలోని బుళ్లసముద్రం సమీపంలో 544ఈ- జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఆగి ఉన్న లారీని టెంపోట్రావెలర్ వెనుక నుంచి ఢీ కొనడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

**తిరుమల వెళ్లి తిరిగి వస్తుండగా...**

గుడిబండ మండలం కేఎన్ పల్లి గ్రామానికి చెందిన శివరాజు, ప్రేమకుమారి(30) దంపతులకు అథర్వ (2), మరో కూతురు సంతానం. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న శివరాజు తన కుమారుడి పుట్టువెంట్రుకలు తీయించేందుకు కుటుంబీకులు, బంధువులతో కలిసి మొత్తం 23 మంది గురువారం సాయంత్రం ఓ టెంపో ట్రావెలర్, మరో రెండు కార్లలో తిరుమల వెళ్లారు. శుక్రవారం తిరుమలలో అథర్వ నామకరణం, తలనీలాల కార్యక్రమం ముగించుకుని స్వామి దర్శనం చేసుకున్నారు. రాత్రి 11 గంటల సమయంలో స్వగ్రామం కేఎన్ పల్లికి తిరుగు పయనమయ్యారు. శివరాజు, కుమార్తె కారులో బయలుదేరగా.. భార్య ప్రేమకుమారి, కుమారుడు అథర్వ బంధువులతో పాటు టెంపో వాహనంలో పయనమయ్యారు. ఈ వాహనం శనివారం తెల్లవారుజామున మడకశిర మండలం బుళ్లసముద్రం గ్రామ సమీపంలోకి రాగానే 544ఈ- జాతీయ రహదారిపై ముందు నిలిచి ఉన్న లారీని వేగంగా ఢీ కొంది. ఈ ఘటనలో ప్రేమకుమారి, అథర్వతో పాటు అమరాపురానికి చెందిన శివరాజు పెద్దమ్మ రత్నమ్మ(65) పాటు పావగడ తాలూకా కొండపురం గ్రామానికి చెందిన డ్రైవర్ మనోజ్(32) మృతి చెందారు. మరో 11 మంది గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను 108, మడకశిర ఫోర్ వీలర్ అసోసియేషన్ వాహనాల్లో మడకశిర ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్సలు చేయించారు. ఈ ఘనటపై మడకశిర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**నామకరణమే చివరి సంబరం..**

రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందగా... అందులో శివరాజు భార్య ప్రేమకుమారి, కుమారుడు అథర్వతోపాటు శివరాజు పెద్దమ్మ రత్నమ్మ ఉండటంతో ఆ ఇంట విషాదం నెలకొంది. కుమారుడు అథర్వకు నామకరణం చేసి గంటలు గడవక ముందే తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో శివరాజు దుఃఖసాగరంలో మునిగిపోయారు. కారులో వెళ్దామని తాను పిలిచినా బంధువులతో పాటూ వస్తామంటూ టెంపోలో ఎక్కారని, అవే తన భార్య చివరిమాటలవుతాయని ఊహించలేకపోయానని అతను కన్నీరమున్నీరయ్యారు. ఇక మడకశిర ప్రభుత్వ ఆస్పత్రి వద్ద చిన్నారి అథర్వ మృతదేహం చూసిన వారంతా 'అయ్యో ఎంత పని చేశావు దేవుడా అంటూ' కన్నీరుమున్నీరయ్యారు.

**ఆస్పత్రి వద్ద మిన్నంటిన రోదనలు..**

రోడ్డు ప్రమాదంలో గాయపడిన అమరాపురం మండలం శివరానికి చెందిన నాగమణి, గుడిబండ మండలం కేఎన్‌పల్లికి చెందిన గీతమ్మ, శ్రీదేవి, టీచర్ సుజాతమ్మ, కమలమ్మ, గంగమ్మ, కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గ జిల్లా హరిబ్బికి చెందిన శ్వేత, పావగడ తాలుకాలోని హర్తికేరేకు చెందిన గిరిజమ్మ, ఉమేష్, అమ్మాజమ్మ, చిత్రదుర్గ జిల్లాకు చెందిన రవీంద్రలను మడకశిర ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురాగా, కుటుంబీకులు, బంధువులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. తీవ్ర గాయాలతో ఆర్తనాదాలు చేస్తున్న తమవారిని చూసి తల్లడిల్లిపోయారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం 10 మందిని మెరుగైన వైద్యం కోసం తుమకూరుకు తరలించారు. ఇందులో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. విషయం తెలిసిన వెంటనే ఎస్పీ రత్న, డీఎస్పీ వెంకటేశ్వర్లు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మడకశిర ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు.

**నేనెట్లా బతికేది ..**

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన డ్రైవర్ మనోజ్ ఆరేళ్ల క్రితం తమిళనాడు రాష్ట్రానికి చెందిన వినుతను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ప్రమాదంలో అతను మృతి చెందగా...నేనెట్లా బతికేది దేవుడా అంటూ భార్య వినుత బిగ్గరగా రోదించారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో కేఎన్ పల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృత దేహాలకు జెడ్పీటీసీ అనంతరాజు, వైఎస్సార్ మండల కన్వీనర్లు యంజారేగౌడు, నరసింహారెడ్డి నివాళులర్పించారు.

## సంక్రాంతి పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: వివిధ రంగాలలో కృషి చేసిన వారిని గుర్తిస్తూ 'విశిష్ట ప్రతిభా పురస్కారం -25' పేరిట అందించే సంక్రాంతి పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సర్వేజన సుఖినో భవంతు సంస్థ వ్యవస్థాపకులు ఈఎస్ఎస్ నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. సమాజ సేవ, సాహిత్యం, సంగీతం, నృత్యం, కళలు, క్రీడలు, విద్య, వైద్యం వంటి వివిధ రంగాలలో రాణిస్తున్న వారు అవార్డులకు అర్హులని, ఆసక్తి గలవారు ఈ నెల 31లోపు దరఖాస్తులను 'సర్వేజనా సుఖినో భవంతు, డోర్‌నంబర్ 1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం, సికింద్రాబాద్ -15' చిరునామాకు చేరేవిధంగా పంపాలన్నారు. అవార్డుకు ఎంపికైన వారిని వచ్చే నెల 12న హైదరాబాద్‌లో నిర్వహించే సభలో సంక్రాంతి పురస్కారాలందజేస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 96523 47207 నంబర్‌లో సంప్రదించాలన్నారు.





# ప్రశ్నపత్రం తారుమారు



- రెగ్యులర్ విద్యార్థినికి సప్లిమెంటరీ పరీక్ష పత్రం
- డిగ్రీ ఫస్టియర్ తొలి సెమిస్టర్ హిందీ పరీక్షలో అలసత్వం
- ఇన్విజిలేటర్ దృష్టికి తీసుకెళితే నిర్లక్ష్యంగా సమాధానం
- ఎదురుదాడికి దిగిన కళాశాల ప్రిన్సిపాల్

అనంతపురం ఎడ్యుకేషన్: ఇన్విజిలేటర్ నిర్లక్ష్యం.. డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని తీవ్రంగా నష్టపోయే పరిస్థితి వచ్చింది. ఎస్కేయూ పరిధిలోని డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 18 నుంచి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా అనంతపురంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో బీసీఎం మొదటి సంవత్సరం చదువుతున్న సయ్యద్ ఫర్హానాకు ఎస్ఎల్ఎన్ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంగా పడింది. రెగ్యులర్, సప్లిమెంటరీ విద్యార్థులకు ప్రశ్నపత్రాలు వేర్వేరుగా ఉంటాయి. 19న జరిగిన హిందీ పరీక్షలో రెగ్యులర్ విద్యార్థిని ఫర్హానాకు ఆర్ఎస్1-131 కోడ్ కల్గిన ప్రశ్నపత్రం ఇవ్వాల్సి ఉండగా.. సప్లిమెంటరీ విద్యార్థులకు సంబంధించిన ఎస్ఎస్1-131 కోడ్ కల్గిన ప్రశ్నపత్రం అందజేశారు. ప్రశ్నపత్రాలు ఇచ్చే సమయంలో ఇన్విజిలేటర్ కనీసం ఫలానా కోడ్ ప్రశ్నపత్రం రాయాల్సి ఉంటుందనే విషయాన్ని కూడా విద్యార్థులకు చెప్పలేదు. అందులోనూ విద్యార్థులు ఒకరికొకరు మాట్లాడుకునే పరిస్థితి ఉండదు. ఈ క్రమంలో తనకు ఇచ్చిన ఎస్ఎస్1-131 కోడ్ ప్రశ్నపత్రంలోని ప్రశ్నలు చాలావరకు కష్టంగా ఉన్నాయి. తనకు వచ్చిన వాటికి జవాబులు రాసి సదరు విద్యార్థిని బయటకు వచ్చింది. తోటి విద్యార్థులతో మాట్లాడుతుండగా అసలు విషయం బయటపడింది. వెంటనే వెళ్లి ఇన్విజిలేటర్‌ను కలిసి విన్నవించింది. తనకు వేరే ప్రశ్నపత్రం ఇచ్చారని చెప్పగా 'నువ్వు ముందే చూసుకోవాలం'టూ సమాధానం ఇచ్చారు. తానేమీ చేయలేనని చేతులెత్తేశారు. సంబంధం లేని పరీక్షకు ఎలా మార్కులు వేస్తారు? అసలు పరిగణనలోకి తీసుకుంటారా? లేదా? అని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.



రెగ్యులర్ విద్యార్థినికి ఇచ్చిన సప్లిమెంటరీ ప్రశ్నపత్రం

### ఎదురుదాడికి దిగిన ప్రిన్సిపాల్

బాధిత విద్యార్థిని తండ్రి రెడ్డిబాషా శనివారం పరీక్ష కేంద్రానికి వెళ్లి ప్రిన్సిపాల్‌ను కవలగా.. ఆయన ఎదురుదాడికి దిగారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఒకటికి రెండుసార్లు ప్రశ్నపత్రం కోడ్ పరిశీలించి ఇవ్వాలి కదా? అని అడిగాడు. తన కూతురికి జరిగిన నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారంటూ నిలదీశాడు. దీంతో ప్రిన్సిపాల్ ఒంటికాలిపై లేచి చిందులేశాడని రెడ్డిబాషా వాపోయాడు. 'పరీక్ష రాసే ముందు మీపాపే చూసుకోవాలి. మాకు ఎలాంటి సంబంధమూ లేదు. నన్ను అడగొద్దు. ముందు ఇక్కడి నుంచి బయటకు వెళ్లిపో' అంటూ గదమాయించారు. తప్పు చేసిన వారే ఇలా ఎదురుదాడికి దిగితే తాము ఎవరికి చెప్పుకోవాలంటూ విద్యార్థిని తండ్రి వాపోయాడు. ఉన్నతాధికారులు స్పందించి తమ కూతురికి అన్యాయం జరగకుండా చూడాలని కోరుతున్నాడు.

### విద్యార్థిని ఫర్హానా ఏమి చెబుతోందంటే..

'ప్రశ్నపత్రాలు ఇచ్చే సమయంలో కోడ్ విషయమే చెప్పలేదు. పరీక్ష ముగిసిన తర్వాత మా ఫ్రెండ్స్‌తో కలిసి మాట్లాడినపుడు విషయం తెలిసింది. వెంటనే ఇన్విజిలేటర్‌ను కలిసి తప్పిదం జరిగిందని చెబితే ముందే చూసుకోవాలని చెప్పాడు. ఇంగ్లిష్ పరీక్షలోనూ ప్రశ్నపత్రం కోడ్ చెప్పలేదు. హిందీ పరీక్షకు చెప్పలేదు. నా ఘటన జరిగిన తర్వాత రోజు నుంచి ప్రశ్నపత్రం కోడ్ చెబుతున్నారు. నాకు న్యాయం జరిగేలా అధికారులు చూడాలని కోరుతున్నా'.

## వంద రోజుల కార్యక్రమాన్ని బహిష్కరిస్తాం



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి సిరాజుద్దీన్

అనంతపురం ఎడ్యుకేషన్: సిలబస్ పూర్తికాకనే పదో తరగతి విద్యార్థుల కోసం అమలు చేస్తున్న వందరోజుల కార్యక్రమాన్ని సెలవు రోజుల్లో బహిష్కరిస్తామని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నాయకులు హెచ్చరించారు. శనివారం నగరంలో ఏపీటీఎఫ్ జోనల్ సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేష్, ప్రధానకార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్, రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.నరసింహులు మాట్లాడుతూ కేవలం '100' సంఖ్య కోసం రెండో శనివారం, ఆదివారం, సంక్రాతి సెలవులను కూడా వదలకుండా ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలని ఆదేశాలు ఇచ్చారని వాపోయారు. దీంతో సీనియర్ టీచర్లు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు, మహిళా టీచర్లు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. సెలవుదినాల్లో మినహాయింపు ఇవ్వాలని గతంలోనే వేడుకున్నా ఫలితం లేదన్నారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్‌కుమార్, నాయకులు వెంకటరమణ, వన్నప్ప, లక్ష్మీనారాయణ, తిప్పేస్వామి,హనుమంతు, శ్రీనివాసులు, భాగ్యరాజ్, ఎల్లప్ప, ఫక్రుద్దీన్, సాదిక్, మన్సూర్, రజాక్ పాల్గొన్నారు.

## రాప్తాడుపై తపోవనం జట్టు విజయం



రాప్తాడు, తపోవనం జట్లతో ఆర్డీటీ సిబ్బంది

బత్తలపల్లి: రూరల్ క్రికెట్ సూపర్ లీగ్‌లో రాప్తాడు జట్టుపై తపోవనం జట్టు వంద పరుగుల తేడాతో విజయం సాధించింది. బత్తలపల్లి ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో శనివారం అండర్-15 బాలుర విభాగం క్రికెట్ పోటీల్లో తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న తపోవనం జట్టు 40 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 208 పరుగులు చేసింది. బ్యాటర్లు తన్మయికార్తీక్‌రెడ్డి 60, అభినవ్‌సాల్విక్ 51 పరుగులతో రాణించారు. అనంతరం 209 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన రాప్తాడు జట్టు తపోవనం బౌలర్ కుశాల్‌రాయల్ దెబ్బకు విలవిలలాడింది. 40 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 108 పరుగులు మాత్రమే చేయగలిగింది. రాప్తాడు జట్టులో ఫణి 41 పరుగులు చేశాడు. వంద పరుగుల తేడాతో తపోవనం జట్టు గెలుపొందింది.

## వంద శాతం లక్ష్య సాధనపై దృష్టి

- మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ ఆదేశం

అనంతపురం అగ్రికల్చర్: ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు లక్ష్యాలు సాధించడంపై మార్కెట్ కమిటీలు దృష్టి సారించాలని మార్కెటింగ్‌శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) సి.రామాంజనేయులు ఆదేశించారు. శనివారం నగరంలోని మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో రెండు జిల్లాల ఏడీఎంలు పి.సత్యనారాయణచౌదరి, ఎల్ఎస్ మూర్తితో కలిసి 17 మార్కెట్ కమిటీల సెక్రటరీలు, సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతపురం జిల్లా పరిధిలో ఉన్న 9 మార్కెట్ కమిటీలు, 15 చెక్‌పోస్టుల ద్వారా ఈ ఏడాది రూ.12.06 కోట్లు లక్ష్యం కాగా.. ఎనిమిది నెలలకు గానూ 55 శాతం రూ.6.70 కోట్లు వసూలైందన్నారు. గతేడాది కన్నా ఈసారి రూ.26 లక్షల వరకు ఆదాయం తగ్గిందన్నారు. అనంతపురం, శింగనమల, తాడిపత్రి కమిటీల పరిస్థితి బాగానే ఉన్నా మిగతా వాటిల్లో పురోగతి లేదన్నారు. గుత్తి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, ఉరవకొండ కమిటీల్లో ఆదాయం పెంచాలని ఆదేశించారు.

- అలాగే శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో ఉన్న 8 మార్కెట్ కమిటీలు, 16 చెక్‌పోస్టుల ద్వారా ఈ ఏడాది రూ.5.31 కోట్లు టార్గెట్ కాగా ఇప్పటి వరకు 61 శాతంతో రూ.3.24 కోట్లు వసూలు చేశారని మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ తెలిపారు. వ్యవసాయోత్పత్తుల సీజన్ కావడంతో విజిలెన్స్ బృందాలు మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆదేశించారు. చెక్‌పోస్టులు, మార్కెట్‌యార్డుల్లో నిఘా పెంచాలన్నారు. పశువులు, జీవాలు, చీనీ, చింత, మిరప తదితర మార్కెట్ల ద్వారా ఆదాయం పెంచుకోవాలని సూచించారు. మార్కెట్‌యార్డుల్లో రైతులకు అందిస్తున్న సేవలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమీక్షించారు.



ఏడీఎంలు, సెక్రటరీలతో సమీక్షిస్తున్న మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ సి.రామాంజనేయులు

## ఒకే ఈతలో ఐదు గొర్రె పిల్లలు



గొర్రెను పరీక్షిస్తున్న పశువైద్య సిబ్బంది

కుందుర్పి: మండల కేంద్రంలోని సజ్జల కేశన్నకు చెందిన ఓ గొర్రె శనివారం ఐదు పిల్లలను ఈనింది. రెండేళ్ల వయసున్న ఈ గొర్రె మొదటి ఈతలో 2, రెండో ఈతలో 4 గొర్రె పిల్లలకు జన్మనిచ్చిందని కేశన్న పేర్కొన్నాడు. ఈ విషయమై పశువైద్యాధికారి ప్రసాద్ మాట్లాడుతూ గొర్రెకాని మేకకాని ఒక పిల్లను మాత్రమే ఈనుతాయన్నారు. అయితే జన్యుపరంగా వచ్చే మార్పులవల్ల ఇలా మూడు నుంచి ఐదు పిల్లల వరకు మేకలు, గొర్రెలు ఈనుతుంటాయని చెప్పారు.

## చెట్టుకొమ్మ పడి కూలీ దుర్మరణం



రామ్మూర్తి (ఫైల్)

కుందుర్పి: చెట్టు కోస్తున్న సమయంలో ఓ కొమ్మ విరిగి మీదపడటంతో కూలీ దుర్మరణం చెందాడు. వివరాలిలా ఉన్నాయి. కుందుర్పి మండలం కొలిమిపాళ్యం గ్రామానికి చెందిన దినసరి కూలీ రామ్మూర్తి (35) శనివారం ఉదయం కర్ణాటక సరిహద్దులోని కదిరేపల్లిలో వేపచెట్టు కోసేందుకు వెళ్లాడు. అక్కడ చెట్టు కోస్తున్న సమయంలో ఒక పెద్ద కొమ్మ అకస్మాత్తుగా ఒరిగింది. తప్పించుకునేలోపే మీద పడడంతో రామ్మూర్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

## నారా లోకేష్‌పై కేసు నమోదు చేయాలి



సీఐకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు చవ్వా రాజశేఖర్‌రెడ్డి

అనంతపురం: మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వ్యక్తిగత ప్రతిష్టను దిగజార్చేలా ఐటీడీపీ ద్వారా సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టిస్తున్న మంత్రి నారా లోకేష్‌పై కేసు నమోదు చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు చవ్వా రాజశేఖర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం అనంతపురం టూటౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్‌కు ఫిర్యాదు చేశారు. తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు మాజీ మంత్రులు ఆర్కే రోజా, విడదల రజనిపై అసభ్యకరంగా పోస్టులు పెడుతూ కించపరుస్తున్నారని అందులో పేర్కొన్నారు. మతపరమైన విద్వేషాలను కూడా రెచ్చగొడుతూ సమాజంలో అశాంతి రేపేందుకు కుట్ర చేసే రీతిలో వ్యవహరిస్తున్న ఐటీడీపీ సభ్యులతో పాటు, వీరికి నాయకత్వం వహిస్తున్న నారా లోకేష్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జి.రాజేష్‌రెడ్డి, అనిల్‌కుమార్ గౌడ్, శ్రీనివాసులు, రషీద్, పార్వతి, జఫ్రుల్లా తదితరులు పాల్గొన్నారు.

## సమగ్రశిక్ష ఏపీసీగా డాక్టర్ దేవరాజ్



అనంతపురం: ఎస్కేయూలోని కంప్యూటర్ సైన్సెస్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ పి.దేవరాజ్ శ్రీసత్యసాయి జిల్లా సమగ్రశిక్ష ఏపీసీ (అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్)గా నియమితులయ్యారు. గతంలో ఎస్కేయూ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ దశరథ రామయ్య ఉమ్మడి జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా పనిచేసిన విషయం విదితమే. తాజాగా మరో అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు ఈ అవకాశం దక్కింది. ఈ సందర్భంగా పలువురు దేవరాజ్‌కు అభినందనలు తెలిపారు.


## ఆధునిక వ్యవసాయం లాభదాయకం

బెళుగుప్ప: ఆధునిక వ్యవసాయం రైతులకు లాభదాయకమని జేడీఏ ఉమామహేశ్వరమ్మ, మార్కాపురం ఎస్ఎస్ అగ్రికల్చరల్ డీన్ ఆర్‌వీఎస్‌కే రెడ్డి పేర్కొన్నారు. శనివారం తగ్గుపర్తిలో సర్పంచ్ మౌనిక అధ్యక్షతన కళ్యాణదుర్గం కేవీకే కోఆర్డినేటర్ చంద్రాయుడు రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ వ్యవసాయ కళాశాల మార్కాపురం బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థినులు నిర్వహించిన గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యవసాయ వాతావరణ శాస్త్రవేత్తలు నారాయణస్వామి, చిరుదాన్యాల శాస్త్రవేత్త మాధవీలతతో కలసి జేడీఏ, ఆర్‌వీఎస్‌ఏ రెడ్డి హాజరయ్యారు. అధికారులు మాట్లాడుతూ సాంకేతికతతో కూడిన వ్యవసాయాన్ని రైతులు అలవరచుకుంటే వ్యవసాయం లాభసాటిగా ఉంటుందన్నారు. చిరుధాన్యాల సాగు చేపడితే నికరలాభంతో పాటు పోషకాల లోపాలను అధిగమించి ఆహార భద్రతతో పాటు పోషకాల భద్రతను సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సహకార సంఘ అధ్యక్షుడు వెంకటనాయుడు, మాజీ సర్పంచ్ రాధాకృష్ణ, వ్యవసాయ శాస్త్రవేత్తలు బాలాజీనాయక్, మల్లికార్జున, హరిణి, ఏఓ పృథ్వీసాగర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తగ్గుపర్తిలో మాట్లాడుతున్న జేడీఏ ఉమామహేశ్వరమ్మ

## ఆధునికీకరణకు రూ.500 కోట్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్

అనంతపురం అర్బన్: తుంగభద్ర ఎగువ కాలువ ఆధునికీకరణకు రూ.500 కోట్లు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆధునికీకరణ చేపట్టడం ద్వారా కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ జిల్లాలకు 30 టీఎంసీల నీరు వస్తుందన్నారు. రూ.500 కోట్లు అవసరం ఉంటే రూ.35 కోట్లు మాత్రమే ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఈ నిధులు కాంట్రాక్టర్ల జేబులు నింపేందుకు సరిపోతాయని ఎద్దేవా చేశారు. ఇక పేదలకు పక్కా ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల పెంపుపై జనవరి 2 నుంచి 11 వరకు సచివాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. సీపీఐ స్థాపించి ఈ నెల 26కు 100 ఏళ్లు అవుతున్న నేపథ్యంలో శత వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శి నారాయణ స్వామి, నాయకులు రాజారెడ్డి, మల్లికార్జున, కేశవ రెడ్డి, శ్రీరాములు, రాజే ష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలపై 'అధికార' జులుం





పంచాయతీ కార్యదర్శి ప్రేమ్ కుమార్‌ను నిలదీస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు, చిరిగిన ఫ్లెక్సీ

రాప్తాడు: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా రాప్తాడులో వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి బస్టాండ్ సర్కిల్ వరకు ప్రసన్నాయపల్లికి చెందిన భూమిరెడ్డి మహానందరెడ్డి తదితరుల ఫ్లెక్సీలతో నిండాయి. దీన్ని అధికార టీడీపీ నేతలు జీర్ణించుకోలేకపోయారు. వెంటనే విషయాన్ని ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. దీంతో ఆమె అధికార యంత్రాంగం ద్వారా ఫ్లెక్సీల తొలగింపునకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. గ్రామపంచాయతీ అధికారి ప్రేమ్‌కుమార్ శనివారం తన సిబ్బందిని వెంటబెట్టుకుని బస్టాండ్ సర్కిల్‌కు చేరుకున్నారు. అక్కడ మహానందరెడ్డి ఫ్లెక్సీలను తొలగించారు. సమాచారం అందుకున్న వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది తదితరులు హుటాహుటిన అక్కడకు చేరుకుని తమ నాయకుని ఫ్లెక్సీలు ఎందుకు తొలగిస్తున్నారంటూ ప్రశ్నించారు. పర్మిషన్ తీసుకోకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినందున తొలగిస్తున్నామని కార్యదర్శి సమాధానమిచ్చారు. అలా అయితే మండల కేంద్రంలో టీడీపీ నాయకులు వంద దాకా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని, వీటన్నింటికీ పర్మిషన్ తీసుకుని ఉంటే తమకు చూపించాలని, అప్పుడు తామే స్వచ్ఛందంగా తొలగించుకుంటామని వైఎస్సార్‌సీపీ నాయకులు చెప్పారు. ఏకపక్షంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదని తెగేసి చెప్పారు. దీంతో పంచాయతీ కార్యదర్శి నీళ్లు నములుతూ అక్కడి నుంచి జారుకున్నారు. అనంతరం తొలగించిన ఫ్లెక్సీలను వైఎస్సార్‌సీపీ నాయకులు తిరిగి ఏర్పాటు చేశారు. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు వ్యవహరిస్తున్న తీరును ప్రజలు చీదరించుకోవడం కనిపించింది.

## జగన్ ఫ్లెక్సీకి నిప్పు

- రామగిరి మండలం ఎంసీపల్లిలో ఘటన



మాజీ సీఎం ఫ్లెక్సీని తొలగించిన దృశ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్: రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలంలో టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. రోజూ ఏదో ఒక గ్రామంలో అలజడి సృష్టిస్తున్నారు. ఈ క్రమంలోనే శనివారం మాజీ సీఎం వైఎస్ జగన్ ఫ్లెక్సీకి నిప్పు పెట్టారు. జగన్ జన్మదినం సందర్భంగా గ్రామంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు కేక్ కట్ చేశారు. ఈ క్రమంలో అక్కడ జగన్ ఫొటోతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. వారు కార్యక్రమాన్ని ముగించుకుని వెళ్లగానే ఓర్వలేని టీడీపీ నాయకులు హరిజన మారెప్ప, బొడ్డు నరసింహప్ప, కంసల నారాయణ, దుబ్బు సిద్ధన్న, అశ్వర్థ ఆ ఫ్లెక్సీని తొలగించి నిప్పుపెట్టినట్లు గ్రామస్తులు తెలిపారు.

## కార్మికుల కృషితోనే గుత్తి డీజిల్‌షెడ్ అభివృద్ధి

గుత్తి: కార్మికుల కృషి, కష్టం ఫలితంగానే గుత్తి లోకో రైల్వే డీజిల్‌షెడ్ అంచలంచెలుగా అభివృద్ధి సాధించిందని గుంతకల్లు డీఆర్ఎం విజయ్‌కుమార్ పేర్కొన్నారు. డీజిల్‌షెడ్ 61వ వార్షికోత్సవాలను శనివారం రైల్వే అధికారులు, ఉద్యోగులు, కార్మికులు ఘనంగా నిర్వహించారు. డీఆర్ఎంతో పాటు ఏడీఆర్ఎం సుధాకర్, సీఎంఎస్ వేణుగోపాల్‌రెడ్డి, గుత్తి డీజిల్‌షెడ్ సీనియర్ డీఎంఈ ప్రమోద్, డీఎస్ఏ మంగాచారి, గ్యారేజీ వర్క్‌షాప్ సీనియర్ డీఎంఈ ముఖేష్, గుత్తి, గుంతకల్లు ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు ప్రియాంక, మాధవి తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌లో రైల్వే అధికారులకు, కార్మికులకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. డీఆర్ఎం మాట్లాడుతూ ఏ కొత్త లోకో బయటకు వచ్చిన ముందుగా గుత్తి డీజిల్‌షెడ్‌కు పంపుతారన్నారు. కార్యక్రమంలో అన్ని రైల్వే యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## మహిళ మెడలో చైన్ అపహరణ

అనంతపురం: తెల్లవారుజామున ఇంటి ముందు ముగ్గు వేస్తున్న మహిళ మెడలోని బంగారు చైనును లాక్కెళ్లిన ఘటన నగరంలో చోటు చేసుకుంది. త్రీటౌన్ సీఐ కె.శాంతిలాల్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హెచ్చెల్సీ కాలనీ రోడ్డులో నివాసం ఉంటున్న చిగిచెర్ల లక్ష్మీదేవి (50) శనివారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో ఇంటి ముందు ముగ్గు వేస్తోంది. అదే సమయంలో ఓ వ్యక్తి అటువైపు వచ్చాడు. ఉన్నఫళంగా లక్ష్మీదేవి మెడలోని 25 గ్రాముల బంగారు చైనును లాక్కుని రైల్వేలైన్ వైపు పరుగెత్తి అక్కడి నుంచి మరొక వ్యక్తి బైక్‌లో ఉడాయించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఆటో డ్రైవర్ ఆత్మహత్య



మృతుడు గోవిందు

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని ఓల్డ్ పంచాయతీ కార్యాలయం వెనుక కాలనీలో ఆటో డ్రైవర్ గోవిందు(45) శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్ఐ రామచంద్రారెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గోవిందు ఆరోగ్యం ఇటీవల క్షీణించింది. మతి స్థిమితం కూడా సరిగాలేదు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది శనివారం ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

## లింగ నిర్ధారణపై కఠినంగా వ్యవహరించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: లింగ నిర్ధారణ పరీక్షల నిర్వహణపై కఠినంగా వ్యవహరించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఈబీ దేవి ఆదేశించారు. శనివారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై జిల్లాస్థాయి సలహా మండలి సమావేశం జరిగింది. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ చట్టంపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఆడపిల్లల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో ప్రోగ్రాం అధికారులు సుజాత, యుగంధర్, అనుపమ, రవిశంకర్, జీజీహెచ్ వైద్యులు రవికుమార్, నిసార్‌బేగం, ప్రసన్నభారతి, లక్ష్మీ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### చదువుకు పునాది అంగన్‌వాడీ కేంద్రాలు



చిన్నారులకు విద్యా సామగ్రి అందజేస్తున్న దృశ్యం

**ఆత్మకూరు:** చదువుకు పునాది అంగన్‌వాడీ కేంద్రాలు అని మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీ చైర్మన్ లక్ష్మీరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని పంపనూరు అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు ఎస్‌బీఐ పాన్ ఇండియా సీఎస్‌ఆర్ యాక్టివిటీస్‌లో భాగంగా మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీతో కలసి రూ.2 లక్షలు విలువ చేసే వస్తువులు అందజేశారు. పిల్లలకు ఉపయోగపడే బ్యాగ్‌లు, బాటిల్స్, పలకలతో పాటు, అంగన్‌వాడీ కేంద్రానికి ఎల్‌ఈడీ టీవీ, రైస్ కుక్కర్, ఫిల్టర్, ప్లేట్స్, గ్లాసులు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ వనజా అక్కమ్మ, సీడీపీఓలు శ్రీదేవి, ధనలక్ష్మి, సూపర్‌వైజర్ లావణ్య, అంగన్‌వాడీ కార్యకర్త సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా గణిత దినోత్సవం



మాంటిస్సోరి స్కూల్‌లో గణిత నమూనాల ప్రదర్శన

**అనంతపురం ఎడ్యుకేషన్:** శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని శనివారం నగరంలోని వివిధ స్కూళ్లలో గణిత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీనివాస రామానుజన్ 12 ఏళ్ల వయసులోనే గణితంలో అసాధారణ తెలివితేటలు ప్రదర్శించారని ఉపాధ్యాయులు గుర్తు చేశారు. కఠినమైన గణిత సమస్యలను కూడా అతి సులభంగా పరిష్కరించి ఔరా అనిపించేవారన్నారు. ఆల్‌టైమ్ గ్రేట్ గణిత శాస్త్రజ్ఞుడిగా పేరు పొందారన్నారు. నేటి తరం విద్యార్థులు రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన గణిత నమూనాలను ప్రదర్శించారు.

### మామిడిలో మెలకువలు తప్పనిసరి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త యుగంధర్, జిల్లా ఉద్యాన అధికారి నరసింహా రావు

**ఆత్మకూరు:** మామిడిలో మేలైన దిగుబడుల కోసం మెలకువలు తప్పనిసరి అని కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త యుగంధర్, జిల్లా ఉద్యాన అధికారి నరసింహా రావు రైతులకు సూచించారు. శనివారం ఆత్మకూరు రైతు సేవ కేంద్రంలో రైతులకు వారు మామిడి పంటపై పలు సూచనలు తెలియజేశారు. దిగుబడి కోసం ఏ మందులు పడితే అవి వాడకూడదన్నారు. పూత బయటకు వచ్చిన తరువాత అమ్మోనియం సల్ఫేట్ 350 గ్రాములు, పొటాష్ 200 గ్రాములు, బోరాన్ వంద గ్రాముల చొప్పున ఒక చెట్టుకు ఒక పాదలో వేయాలన్నారు. 15 రోజుల తర్వాత జింక్ సల్ఫేట్ 250 గ్రాములు ఒక చెట్టుకు వేయాలన్నారు. జనవరి నుంచి ఏప్రిల్ వరకు సాయంత్రం వేళల్లో మందులు పిచికారీ చేయాలన్నారు. రైతులు కామన్ మ్యాన్ సర్వీస్ సెంటర్‌లో 2024–25 క్రాప్ ఇన్సూరెన్స్‌లో వరికి ఎకరాకు రూ.630, మొక్కజొన్నకు రూ.525, శనగకు రూ.480, జొన్నకు రూ.315, వేరుశనగకు రూ.480, టమాటకు రూ.1,600 ఎకరాకు రైతులు చెల్లించాలని తెలియజేశారు. కార్యక్రమంలో మండల హార్టికల్చర్ అధికారి రత్నకుమార్, ఏఈఓ సుజిత తదితరులు పాల్గొన్నారు.

### ధ్యానంతో ఒత్తిడి దూరం



మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

**అనంతపురం కల్చరల్:** ధ్యానం మన జీవితంలో ఒక భాగంగా మారిపోవాలని ఎంపీ లక్ష్మీనారాయణ, వివేకానంద యోగా కేంద్రం అధ్యక్షుడు మెళవాయి రాజశేఖరరెడ్డి, సిస్టర్ శారదా, డాక్టర్ హరిప్రసాద్ సూచించారు. ఐక్యరాజ్యసమితి సూచనల మేరకు శనివారం మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం వేదికగా అంతర్జాతీయ ధ్యాన దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒత్తిడి నిండిన నేటి సమాజంలో సంపూర్ణ ఆరోగ్యవంతులు కావడానికి ధ్యానం చేయాలని సూచించారు. అనంతరం యోగా మాస్టర్ మారుతీప్రసాద్, వివిధ కేంద్రాల ప్రతినిధులు దివాకర్, నరసయ్య, ఆంజనేయులు, పుల్లయ్య, శ్రీధరమూర్తి, తారక్, శ్రీనివాసుల శెట్టి, చెన్నకేశవులు తదితరులు ప్రాణాయామ, ధ్యాన పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో వివేకానంద యోగా కేంద్రం, పతంజలి యోగా సమితి, ప్రజాపతి బ్రహ్మకుమారీస్, హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ ఇనిస్టిట్యూషన్, పిరమిడ్ ధ్యాన కేంద్రం, సత్యసాయి ధ్యానమండలి, ఆర్ట్ ఆఫ్ లివింగ్, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, రామచంద్ర మిషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# వైఎస్ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

- వైఎస్సార్‌సీపీ బలోపేతానికి సైనికుల్లా పని చేస్తాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి
- ఘనంగా మాజీ సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి. చిత్రంలో టాస్క్‌ఫోర్స్ సభ్యుడు రమేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ వాసంతి, తదితరులు

**అనంతపురం కార్పొరేషన్:** 'సీఎంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్నో విప్లవాత్మక సంస్కరణలను తీసుకువచ్చి శ్యాచురేషన్ పద్ధతిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమాన్ని అందించారు. దేశంలో ఎంతో మందికి మార్గదర్శకంగా నిలిచారు. అటువంటి వ్యక్తి సీఎంగా ఉంటేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుంది. మరోమారు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని సీఎం చేసుకునేందుకు సైనికుల్లా కృషి చేస్తాం' అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు అందించారు. అనంతరం పార్టీ శ్రేణులు బాణా సంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. సీఎంగా ఉన్న సమయంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పాలన అందించడంతో ఈరోజు రాష్ట్ర ప్రజలు వైఎస్ జగన్‌ను సొంత బిడ్డగా, అన్నగా, ఆత్మీయ బంధువుగా భావించి పుట్టిన రోజు జరుపుకుంటున్నారన్నారు. డాక్టర్ వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందాలని పరిపాలనలో నూతన సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్‌తో ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. మహానేత వైఎస్సార్ తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2019 ఎన్నికలకు ముందు ప్రజలకు విజ్ఞప్తి చేసిన మేరకు తన తండ్రి ఒక అడుగు వేస్తే తాను రెండు అడుగులు వేస్తామని చెప్పి మాట నిలబెట్టుకున్నారన్నారు. మేనిఫెస్టోను 99 శాతం అమలు చేశారన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా ప్రజల ఖాతాల్లోనే నేరుగా డబ్బు జమ చేసేలా చర్యలు తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. అమ్మఒడి, విద్యా దీవెన, కానుక, అందరికీ ఇళ్లు తదితర పథకాల్లో మహిళలకే అధిక ప్రాధాన్యత కల్పించారన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ.. జగనన్న మహిళా సాధికారత సాధించేందుకు విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. మేయర్ వసీం మాట్లాడుతూ.. ముస్లిం మైనార్టీలు అన్ని విధాల అభివృద్ధి చెందేలా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ టాస్క్‌ఫోర్స్ సభ్యుడు రమేష్‌గౌడ్ మాట్లాడుతూ.. బీసీలు వెనుకబడ్డ వారు కాదని బీసీలు బ్యాక్ బోన్ అంటూ.. బడుగుల అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప వ్యక్తి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సాకే చంద్ర, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, ముఖ్య నాయకులు అనంత చంద్రారెడ్డి, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు సాకే చంద్రశేఖర్, మల్లెమీద నరసింహులు, ఓబిరెడ్డి, శ్రీదేవి, సైఫుల్లాబేగ్, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉమాపతి, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్ర రెడ్డి, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, రహంతుల్లా, రాజేశ్వరి, నాయకులు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, కొర్రపాడు హుస్సేన్ పీరా, ఎగ్గుల శ్రీనివాసులు, మీసాల రంగన్న, చిట్రా వెంకటేష్, అమర్‌నాథ్ రెడ్డి, జానీ, తనీష, వేమల నదీం, చింతకుంట మధు, ధనుంజయ యాదవ్, వెన్నపూస రామచంద్రారెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, చామలూరు రాజగోపాల్, హరిత, రాధాకృష్ణ, జావెద్, రామయ్య, భారతి, శోభారాణి, శోభాబాయి, సుజాత రెడ్డి, ఆలమూరు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

**వైఎస్ జగన్ నిండూ నూరేళ్లు వర్ధిల్లాలి**

**రాప్తాడు:** గత ఐదేళ్లు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగించారు. ఆయన నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం రాప్తాడులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మితో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్తు బిల్లుల పెంపును నిరసిస్తూ ఈనెల 27న నియోజకవర్గ కేంద్రంలో తలపెట్టిన ధర్నాకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రజల నెత్తిన రూ. 15 వేల వేల కోట్ల భారం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు దాటినా చంద్రబాబు రైతు భరోసా ఇవ్వలేదన్నారు. పంటల బీమా రావడం లేదని తెలిపారు. పంటల బీమా ప్రీమియం కూడా రైతులే కట్టే పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతన్నలను ఆదుకోవాలనే సంకల్పంతో పుట్టపర్తి జిల్లాలో ర్యాలీ చేపట్టడం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ నాయకులు ఎక్కడైనా దాడులు, దౌర్జన్యాలు చేస్తే సహించేది లేదన్నారు. నియోజకవర్గంలో సోషల్ మీడియా కార్యకర్త రామాంజనేయులును అరెస్ట్ చేసి, కేసు పెట్టినట్లు తెలిపారు. ఇప్పటికే 9 కేసులకు సంబంధించి బెయిల్ వచ్చిందని, మిగిలిన కేసులకు కూడా త్వరలోనే బెయిల్ వచ్చి విడుదల అవుతారన్నారు. జగనన్న ప్రవేశ పెట్టిన పథకాలు ఒకటి కూడా అమలులో లేవన్నారు. చంద్రబాబు ఇస్తానని చెప్పినా సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చలేదన్నారు. అమ్మకు వందనం లేదు కానీ నాన్నకు బుడ్డి మాత్రం అందుబాటులో ఉందన్నారు. రాప్తాడులోనే రూ.66 లక్షల దొంగ సరుకు (మద్యం) తీసుకు వచ్చి అమ్ముతున్నారన్నారు. ప్రస్తుతం 3 లక్షల ఉద్యోగాలు పోయాయని తెలిపారు. మూడున్నర లక్షల పింఛన్లు తొలగించడం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, సానుభూతి పరుల పింఛన్లు మాత్రమే తొలగిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, అనంతపురం రూరల్, రాప్తాడు మండల కన్వీనర్లు బండి పవన్ కుమార్, గోవింద్ రెడ్డి, జూటూరు శేఖర్, నాయకులు చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, చిట్రా వెంకటేష్, పసుపుల ఆది, నురుగంటి నారాయణ రెడ్డి, అడ్వకేట్ నాగన్న తదితరులు పాల్గొన్నారు.

**ఆత్మకూరులో..**

**ఆత్మకూరు:** ఆత్మకూరు పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద మాజీ సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ లక్ష్మీనరసింహులు, ఎంపీపీ హేమలత, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, సీనియర్ నాయకులు, వీరాంజనేయులు, బాలపోతన్న, వాసుదేవరెడ్డి, పార్వతమ్మ, వెంకట్రాముడు, నరసింహా రెడ్డి, ఈశ్వర రెడ్డి, చెన్నారెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్, సర్పంచులు వరలక్ష్మి, ఎర్రిస్వామి, ఓబులేసు, ఓబుశేష్, లక్ష్మీనారాయణ రెడ్డి, ఉప సర్పంచులు తైదుల శివారెడ్డి, మంజుల, నాయకులు ఫణిరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, బాలస్వామి రెడ్డి, వన్నూరప్ప, అతిక్‌రెడ్డి, శివారెడ్డి, శాగం దామోదర్ రెడ్డి, కొండారెడ్డి, మనోహర్, వెంకటేష్, రామాంజి, అక్కులన్న, శ్రీరామ్, మురళి, గంగాధర్, టైలర్ వెంకటేష్, పోతన్న, కృష్ణానాయక్, లక్ష్మీనారాయణ రెడ్డి, శీన, ఈశ్వరరెడ్డి, మహేష్, ప్రసాద్, లక్ష్మీనారాయణ, లక్ష్మీరెడ్డి, ఓబయ్య, సురేష్, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

**ఎస్కేయూలో..**

**అనంతపురం:** శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం వద్ద మాజీ సీఎం వైఎస్ జగన్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో యాదవ సాధికారిక కమిటీ చైర్మెన్ హరీష్ కుమార్ యాదవ్, వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జీవీ లింగా రెడ్డి, మద్దిరెడ్డి నరేంద్ర రెడ్డి, ఎద్దుల భాను ప్రకాష్ రెడ్డి, విద్యార్థి విభాగం నాయకులు పి.హేమంత్‌కుమార్ వాసు, భరత్, ,మహేష్, తేజేశ్వర రెడ్డి, రాకేష్ రెడ్డి, ఉమేష్ రెడ్డి, జయంత్ కుమార్, రమేష్, సురేష్, శివ, షేక్షా, తదితరులు పాల్గొన్నారు.

**పండ్లు, బ్రెడ్లు పంపిణీ..**

**అనంతపురం రూరల్:** రాజీవ్ కాలనీ పంచాయతీలోని వృద్ధాశ్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామి రెడ్డి కేక్ కట్ చేశారు. వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అనంత చంద్రా రెడ్డి, రాజీవ్ కాలనీ సర్పంచ్ ఆషాబీ, వైఎస్సార్‌సీపీ నాయకులు రహీమ్, హుస్సేన్, అంజి, లక్ష్మీనరసింహ, హాజరబీ తదితరులు పాల్గొన్నారు.

**వైఎస్సార్‌టీఏ ఆధ్వర్యంలో..**

**అనంతపురం ఎడ్యుకేషన్:** స్థానిక ఉపాధ్యాయ భవనంలో వైఎస్సార్‌టీఏ ఆధ్వర్యంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, రాష్ట్ర నాయకులు వెంకటరమణప్ప, రాధాకృష్ణరెడ్డి, గంగాధర్‌రెడ్డి, గోపాల్, రామకృష్ణ, కృష్ణానాయక్ పాల్గొన్నారు.

**అనంతపురం రూరల్ మండలంలో..**

**రాప్తాడు రూరల్:** అనంతపురం రూరల్ మండల వ్యాప్తంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో రాచానపల్లి సర్పంచ్ బండా అంజియాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు భానుకోట శివ, ఎంపీటీసీ గౌస్, నాయకులు శ్రీరామిరెడ్డి, వంశీ, దిలీప్, నిఖిల్, నాగేంద్ర, సర్పంచ్ సుబ్బిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బండి పవన్, నారాయణస్వామి, వేణు, లింగమయ్య, జగదీష్, యోగి, అనిల్, అంజి నాయకులు నబీరసూల్, రామాంజనేయులు, రవి, అజయ్‌గౌడ్, సురేష్, సూరి, కాటమయ్య, లింగన్న తదితరులు పాల్గొన్నారు.



ఎస్కేయూ ప్రధాన ద్వారం వద్ద వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకుల సంబరాలు



ఆత్మకూరులో మాజీ సీఎం జగనన్న జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు



వైఎస్సార్‌టీఏ ఆధ్వర్యంలో..



కేక్ కట్ చేస్తున్న రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ నదీం అహ్మద్, కోగటం, తదితరులు



అనంతపురంలోని పార్టీ కార్యాలయం వద్ద బాణసంచా కాలుస్తున్న నాయకులు



కేక్ కట్ చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మెన్లు ఎల్ఎం మోహన్‌రెడ్డి, ఉమాదేవి

## సామాజిక సేవల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు

**అనంతపురం కార్పొరేషన్:** వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా పార్టీ శ్రేణులు సామాజిక సేవా కార్యక్రమాల్లో పునరంకితం అయ్యారు. పార్టీ టాస్క్ ఫోర్స్ సభ్యుడు రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో కమలానగర్‌లో నిరాశ్రయుల ఆశ్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి వృద్ధులకు దుప్పట్లు, బెడ్లు పంపిణీ చేశారు. కేక్ కట్ చేసి వృద్ధులకు పంచి పెట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, పార్టీ ముఖ్య నేత అనంత చంద్రారెడ్డి, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, నాయకులు ఎగ్గుల శ్రీనివాసులు, లబ్బే రాఘవ, శివారెడ్డి, హేమకిరణ్, మణికంఠ, హిదాయతుల్లా, బెస్త వెంకటేష్, భాస్కర్‌గౌడ్, బాలాజీ, శోభ, తదితరులు పాల్గొన్నారు. హౌసింగ్ బోర్డులో మీనాక్షమ్మ సమ్మిళిత వికాస కేంద్రంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ నదీం అహ్మద్ దివ్యాంగుల సమక్షంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, నాయకులు రంగంపేట గోపాల్ రెడ్డి, నాగార్జున రెడ్డి, గోపీనాథ్ యాదవ్, లెనిన్, రవికాంత్ రమణ, తదితరులు పాల్గొన్నారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్ రెడ్డి ఆయన క్యాంపు కార్యాలయంలో జగన్ జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమామోహన్ రెడ్డి, నాయకులు నీరుగంటి నారాయణ రెడ్డి, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. జగన్ ప్రజా సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు కట్టుబడి తానీష ఆధ్వర్యంలో కమలానగర్‌లోని నిరాశ్రయుల ఆశ్రమంలో వృద్ధులకు పార్టీ అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నదానం చేశారు. కార్యక్రమంలో జేపీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు షాషావలి, నూర్, జబివిల్లాహ్, రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రి వద్ద మేయర్ వసీం అన్నదానం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, నాయకులు కాకర్ల శీన, తదితరులు పాల్గొన్నారు.

**రక్తదానం..**

నగరంలోని దీపు రక్తనిధి కేంద్రంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభిమానులు పి.అభిషేక్ రెడ్డి, జి.షణ్ముక, బి.ధీరజ్‌కుమార్, ఎం.నూర్, వి.ఉదయ్ కుమార్ రెడ్డి, వై.రవితేజ రెడ్డి రక్తదానం చేశారు.

## కార్యకర్తలకు అండగా ఉంటాం



రూ.లక్ష చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

**ఆత్మకూరు:** కూటమి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతోంది. కార్యకర్తలకు నిరంతరం అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడనే కారణంతో మదిగుబ్బ గ్రామానికి చెందిన జింకల రామాంజనేయులుపై కేసులు పెట్టడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం కక్ష కట్టి అతడిని రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు. అనంతరం మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పంపించిన రూ.లక్ష చెక్కును రామాంజనేయులు కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మదిగుబ్బ సర్పంచ్ నరసింహులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మదిగుబ్బ వీరాంజనేయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

### భూములను పరిరక్షించాలి

**రాప్తాడు:** మరూరు రెవెన్యూ గ్రామంలో ప్రభుత్వ, దేవదాయ శాఖ భూములు కబ్జాకు గురవుతున్నాయి. సదరు భూములను పరిరక్షించాలని తహసీల్దార్ విజయ కుమారికి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. శనివారం మండలంలోని మరూరు గ్రామ సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మరూరు రెవెన్యూ గ్రామంలో చౌడేశ్వరి దేవి, ఆంజనేయ స్వామి, శిద్ద నాగేశ్వర స్వామి, ఆంజనేయ స్వామి, పోతులయ్య స్వామి దేవాలయాలకు సంబంధించి 50 నుంచి 100 ఎకరాల మాన్యం ఉందని గోపాల్, కేశవ, వెంకటరాముడు, మాజీ డీలర్ సూరి, వీరనారప్ప తదితరులు తెలిపారు. ఆ భూమిని కొందరు స్వార్థపరులు కబ్జా చేసి సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2 ఎకరాల భూమిని కూడా కబ్జా చేసి సాగు చేస్తున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వ, దేవాదాయ భూములను సర్వే చేసి, చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ కరుణాకర్, సర్వేయర్ రామాంజనేయులు, వీఆర్వోలు రవి కిరణ్ పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



అలంకరణలో అయ్యప్ప స్వామి



జ్యోతులతో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

**అనంతపురం కల్చరల్:** మొదటి రోడ్డులోని హరిహరసుత అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం ఉత్సవాల ముగింపు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మహాపడి పూజ ఆకట్టుకుంది. స్వామియే శరణం అయ్యప్ప.. అంటూ మాలధారులు నామస్మరణ చేస్తూ సర్వాంగ సుందరంగా అలంకరించిన 18 మెట్లకు వివిధ రకాల పుష్పాలతో అంబళి పూజలు చేశారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ మెంబర్ గంగన లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పడిమెట్ల పూజలో అన్నదాన కమిటీ నిర్వాహకులు కొర్రపాటి శ్రీనివాసులు, ఆంజనేయులు, వెంకటనారాయణ, రామనారాయణ, చలపతి, మహేష్, రాజశేఖరరెడ్డి, ఫణి పాల్గొన్నారు.

**రాప్తాడు:** చిన్మయ నగర్‌లో శనివారం రాత్రి అయ్యప్ప స్వామి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. అయ్యప్ప స్వామి ఉత్సవ మూర్తికి విశేష అభిషేకాలు, అలంకారం చేసి రథంపై కొలువుదీర్చారు. స్థానిక ప్రసన్నేశ్వర స్వామి ఆలయం వద్ద నుంచి బ్యాండు మేళాల మధ్య, భక్తుల జయజయధ్వానాల మధ్య సమీప కూడళ్ల ద్వారా ఉత్సవ విగ్రహాన్ని రథంపై పురవీధుల్లో ఊరేగించారు.

### ఎల్ఆర్‌జీ పాఠశాల వార్షికోత్సవం



ప్రిన్సిపల్ సివిల్ జడ్జి రాహుల్ అంబేడ్కర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

## సంక్షిప్త సమాచారం

**రాప్తాడు:** మండల పరిధిలోని చిన్మయ నగర్‌లో ఉన్న ఎల్ఆర్‌జీ ప్రభుత్వ ఎయిడెడ్ ఆంగ్ల మాధ్యమ పాఠశాల 61వ వార్షికోత్సవం శనివారం ప్రిన్సిపాల్ బొంతు ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా నంద్యాల జిల్లా డోన్ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) రాహుల్ అంబేడ్కర్, ఏపీ, తెలంగాణ ఎస్ఎఫ్ఎస్ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ సురేష్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి పౌరులని.. సామాజిక బాధ్యతను పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీహర్ష, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ సుగుణమ్మ, ప్రొఫెసర్ రాజ్ కుమార్, మోహన్ మురళి, పాఠశాల కరస్పాండెంట్ బాలశౌరి పాల్గొన్నారు.

**జీజీహెచ్ ఆర్ఎంఓగా డాక్టర్ రామకృష్ణ**

**అనంతపురం ఎడ్యుకేషన్:** ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్‌గా(ఆర్ఎంఓ) డాక్టర్ రామకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం కర్నూలు బీక్యాంపు సివిల్ డిస్పెన్సరీలో పని చేస్తున్న రామకృష్ణ పదోన్నతిపై ఇక్కడికి బదిలీ అయ్యారు. రెండు మూడు రోజుల్లో బాధ్యతలు తీసుకోనున్నట్లు తెలిసింది.

**నేడు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా**

**అనంతపురం:** జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ప్రదర్శనల్లో ఏబీవీపీ నాయకులను అరెస్ట్ చేశారు. ఇందుకు నిరసనగా ఆదివారం వన్‌టౌన్ పోలీసు స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యులు దివాకర్ నాయక్ పేర్కొన్నారు. ఆయన ఎస్కేయూలో విలేకరులతో మాట్లాడారు. శాంతియుతంగా నిరసన చేపడుతున్న విద్యార్థి నాయకులను అరెస్ట్ చేసిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలనే ప్రధాన డిమాండ్‌తో ఆందోళన చేపడుతున్నామన్నారు.

**అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి**

**అనంతపురం టవర్‌క్లాక్:** అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బీఎస్పీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అంబేడ్కర్ పేరుకు బదులుగా దేవుడి పేరు తలుచుకోవాలని మాట్లాడటం సరికాదన్నారు. తక్షణమే ఆయన్ను పార్టీ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. హరిప్రసాద్, కుల్లాయప్ప, గోపాల్, నాగరత్నమ్మ, జిలాన్ బాషా, గఫూర్, రాఘవేంద్రమ్మ, కుళ్లాయప్ప, అంజి, శ్రీనా, రాజు పాల్గొన్నారు.

**జూడో అసోసియేషన్ నుంచి తొలగింపు**

**అనంతపురం టవర్‌క్లాక్:** జిల్లా జూడో అసోసియేషన్ నుంచి కేఎన్ బాబును తొలగించినట్లు జూడో అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ భాస్కర్ నాయుడు తెలిపారు. శనివారం స్థానిక మున్సిపల్ గెస్ట్ హౌస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో జూడో పోటీల నిర్వహణలో అక్రమాలు, అవినీతి జరిగడంతో జిల్లా జూడో అసోసియేషన్ నుంచి కేఎన్ బాబు, సభ్యులను తొలగిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే కొత్తగా హడ్‌హాక్ కమిటీ నియమించామన్నారు. కన్వీనర్‌గా సాకే గోవింద్, కో–కన్వీనర్లుగా విక్టర్,రామాంజనేయులును నియమించినట్లు వెల్లడించారు. ఇక నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు వీరి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు.

### యువతి అదృశ్యం

**అనంతపురం:** నగరంలోని బాలసదన్‌లో ఉంటున్న షేక్ షబానా (18) అనే యువతి శనివారం ఉదయం అదృశ్యమైనట్లు వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపారు. గుంతకల్లులో యువతి ఆచూకీ కనుగొన్నట్లు పేర్కొన్నారు.